క్లుప్తంగా

నేత్రపర్వంగా సువర్చలా హనుమద్ కల్యాణం

జంగారెడ్డిగూడెం రూరల్: ఆంజనేయస్వామి జన్మనక్షత్రం పూర్వాభాద్ర నక్షత్ర తిథి కావడంతో జంగారెడ్డిగూడెం మండలం గురవాయిగూడెం మద్ది ఆంజనేయస్వామి క్షేత్రంలో శుక్రవారం సువర్చలా హనుమద్ కల్యాణం నిర్వహించారు. ఆలయ అర్చకులు, వేద పండితులు కల్యాణాన్ని నేత్రపర్వంగా నిర్వహించారు. భక్తులు కార్యక్రమంలో పాల్గొని స్వామి వారి కల్యాణాన్ని వీక్షించారు. ఈవో ఆకుల కొండలరావు, ఆలయ పర్యవేక్షకులు జవ్వాది కృష్ణ, కురగంటి రంగారావు, ధర్మకర్తల మండలి సభ్యులు పాల్గొన్నారు.

కొత్త పింఛన్ల పంపిణీ

కామవరపుకోట: తడికలపూడిలో ఒకటో, రెండవ సచివాలయాల పరిధిలో నూతనంగా మంజూరైన పింఛన్లను శుక్రవారం జెడ్పీటీసీ రమేష్ లబ్ధిదారుల ఇంటికి వెళ్లి అందజేశారు. తడికలపూడి గ్రామానికి చెందిన డయాలసిస్ వ్యాధిగ్రస్తుడు చాట్ల గంగాధరరావుకు మంజూరైన రూ.10,000 ఇంటికి వెళ్లి అందజేశారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ రమేష్ మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రజా సంక్షేమమే లక్ష్యంగా రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారని అన్నారు. సర్పంచ్ కొత్తపల్లి రజని శ్రీనివాస్, ఉప సర్పంచ్ కోలా విష్ణు, ఎంపీటీసీలు గంగుల కడియాలు, గంగుల కాశీ, కొండపల్లి ధర్మరాజు పాల్గొన్నారు.

శ్రీనివాసపురంలో..

జంగారెడ్డిగూడెం రూరల్: అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలను అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని సర్పంచ్ యడ్లపల్లి రాధిక అన్నారు. మండలంలోని శ్రీనివాసపురం సచివాలయంలో కొత్తగా మంజూరైన పెన్షన్లను సర్పంచ్ రాధిక, ఉప సర్పంచ్ పోల్నాటి శ్రీనివాసరావు చేతుల మీదుగా లబ్ధిదారులకు అందజేశారు. ఎంపీటీసీ జుజ్జవరపు తాతారావు, వైఎస్సార్ సీపీ నాయకులు పోల్నాటి నాని, పోల్నాటి రాజా, పోల్నాటి రాజు, సిర్రా రాజేష్ పాల్గొన్నారు.

శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్ట్‌కు రూ. లక్ష విరాళం

ద్వారకాతిరుమల: శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్ట్‌కు ఒక భక్తురాలు శుక్రవారం లక్ష రూపాయలను విరాళంగా అందజేశారు. ఏలూరుకు చెందిన ఎ.సత్యవాణి ముందుగా స్వామి, అమ్మవార్లను దర్శించారు. అనంతరం ఈ విరాళం చెక్కును ఆలయ ఈఓ వేండ్ర త్రినాథరావుకు అందజేయగా, ఆయన దాతకు విరాళం బాండ్ పత్రాన్ని అందించారు.

లోకేశ్ దిష్టిబొమ్మ దహనం



పోలవరంలో లోకేశ్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న దృశ్యం

పోలవరం రూరల్: టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ అనుచిత వ్యాఖ్యలు చేయకుండా నోరు అదుపులో పెట్టుకుని ఉండాలని పోలవరం వైఎస్సార్ సీపీ మండలాధ్యక్షుడు బుగ్గా మురళీకృష్ణ పేర్కొన్నారు. ఏలూరు జిల్లా పోలవరం నియోజకవర్గంలో పర్యటించిన నారా లోకేశ్ నియోజకవర్గ ఎమ్మెల్యే తెల్లం బాలరాజుపై చేసిన అనుచిత వ్యాఖ్యలను ఖండిస్తూ పోలవరం ఏటిగట్టు సెంటర్లో వైఎస్సార్ సీపీ నాయకులు లోకేశ్ దిష్టిబొమ్మను శుక్రవారం దహనం చేసి నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

పరిపూర్ణం.. పవిత్రోత్సవం

ద్వారకాతిరుమల: చినవెంకన్న ఆలయంలో నిర్వహిస్తున్న శ్రీవారి దివ్య పవిత్రోత్సవాలు శుక్రవారం విశేషపూజా కార్యక్రమాలతో ముగిసాయి. ఆలయంలో ఏడాది పొడవున తెలిసీ తెలియక జరిగిన తప్పులకు ప్రాయఃశ్చిత్తం నిమిత్తం నిర్వహించిన ఈ ఉత్సవాలు నాలుగు రోజుల పాటు నిర్వహించారు. అందులో భాగంగా ఉదయం ఆలయంలో పవిత్రావరోహణ, శ్రీ మహా పూర్ణాహుతి హోమం, అనంతరం మహదాశీర్వచనాన్ని ఆలయ అర్చకులు, పండితులు వైభవంగా నిర్వహించారు. గర్భాలయంలో కొలువైన శ్రీవారి మూలవిరాట్, పద్మావతి, ఆండాళ్ అమ్మవార్లపైన, ఉత్సవ మూర్తులపైన ఉంచిన దివ్య పవిత్రాలను అర్చకులు వేద మంత్రోచ్ఛరణల నడుమ తొలగించారు. అనంతరం మహా పూర్ణాహుతి హోమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈఓ వేండ్ర త్రినాథరావు, ట్రస్ట్ బోర్డు సభ్యులు పెద్దిరెడ్డి వెంకటకొండ పద్మ, పాలా వెంకటేశ్వరరావు పాల్గొన్నారు. ఆర్జిత సేవలు, నిత్యార్జిత కల్యాణాలను శనివారం నుంచి పునరుద్ధరించనున్నట్టు ఈఓ తెలిపారు.

వరకట్న వేధింపులపై కేసు

జంగారెడ్డిగూడెం: వరకట్న వేధింపులపై మహిళ ఫిర్యాదు అందించడంతో కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఎం.సాగర్‌బాబు తెలిపారు. ఆయన తెలిపిన వివరాలు ప్రకారం చీకట్ల జ్యోతికి 2015లో చీకట్ల పాల్‌తో వివాహమైందన్నారు. వివాహ సమయంలో జ్యోతి తల్లిదండ్రులు రూ. 50వేలు నగదు, 2 కాసుల బంగారం, ఆడపడుచు కట్నం రూ. 15వేలు, సారె కింద రూ. లక్ష ఇచ్చారన్నారు. ఇటీవల చెడు వ్యసనాలకు బానిసైన పాల్ , అతని కుటుంబ సభ్యుల మాటలు విని జ్యోతిని అధిక కట్నం కోసం శారీరకంగా, మానసికంగా వేధిస్తున్నాడు. దీనిపై జ్యోతి ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ప్రజా సంక్షేమమే లక్ష్యంగా సీఎం జగన్ పాలన

- నిర్వాసితుల సమస్యలు పరిష్కరించేందుకు కృషి
- ఎమ్మెల్యే తెల్లం బాలరాజు
- వాడపల్లి, ఎర్రవరంలో గడపగడపకు మన ప్రభుత్వం



జీలుగుమిల్లి పీహెచ్‌సీలో భవన నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే బాలరాజు

బుట్టాయగూడెం(జీలుగుమిల్లి): ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని ఎమ్మెల్యే తెల్లం బాలరాజు అన్నారు. జీలుగుమిల్లి మండలం వాడపల్లి ఎర్రవరం నిర్వాసిత గ్రామాల్లో శుక్రవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే బాలరాజు ఇంటింటికీ వెళ్లి గడచిన మూడేళ్లలో ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాల వల్ల ఆయా కుటుంబాలకు కలిగిన లబ్ధిని వివరించారు. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వాటి పరిష్కారానికి కృషి చెయ్యాలని అధికారులను ఆదేశించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఎన్ని ఇబ్బందులు ఎదురైనా ఇచ్చిన మాటకు కట్టుబడి సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారని అన్నారు. నిర్వాసితుల సమస్యలను పరిష్కరించేందుకు ప్రత్యేక కృషి చేస్తున్నామని చెప్పారు. ప్రతి గడపకూ వెళ్లినప్పుడు ప్రజలు ఎంతో సంతోషంగా స్వాగతం పలుకుతున్నారని చెప్పారు.

ప్రజారోగ్య పరిరక్షణకు సీఎం జగన్ కృషి

ప్రజారోగ్య పరిరక్షణకు సీఎం జగన్ ఎనలేని కృషి చేస్తున్నారని ఎమ్మెల్యే తెల్లం బాలరాజు అన్నారు. జీలుగుమిల్లిలో ప్రభుత్వ ఆస్పత్రి ప్రాంగణంలో సుమారు రూ.50 లక్షల వ్యయంతో నిర్మించే బ్లాక్ పబ్లిక్ యూనిట్ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతనంగా ప్రవేశపెట్టిన ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమాన్ని గిరిజన ప్రాంతంలో విజయవంతంగా నిర్వహిస్తున్నట్టు ఎమ్మెల్యే బాలరాజు అన్నారు. వంకవారిగూడెంలో రూ. 20 లక్షల వ్యయంతో నిర్మించే సీసీ రోడ్డుకు శంకుస్థాపన చేశారు. చంద్రమ్మ కాలనీలో రూ. 30 లక్షల వ్యయంతో నిర్మించే సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కోర్సా పోశమ్మ, పోలవరం ఎంపీపీ సుంకర వెంకటరెడ్డి, వైస్ ఎంపీపీ సోమగాని శ్రీనివాస్, సర్పంచ్ సిర్రి జగదాంబ, ఎంపీటీసీలు సున్నం సురేష్, మొడియం వెంకలక్ష్మి, సొసైటీ అధ్యక్షులు బోదా శ్రీనివాసరెడ్డి, గంటసాల గాంధీ, నాయకులు చందా ప్రసాద్, చక్రవర్తి, రవితేజ, బూరుగు ప్రేమ్‌కుమార్, చిట్టిబొమ్మ శ్రీనివాస్, కొప్పుల సత్యనారాయణ, సిర్రి మోహన్, బొంతు రామకృష్ణ, కుంజా చిన్నరాముడు, వంకా రామకృష్ణ, సిర్రి శిరమయ్య, ఉప్పల రాంపండు, కుసుమ వెంకట్, బొంతు రవితేజ, సిర్రి రామకృష్ణ, మడకం ధర్మరాజు, తహసీల్దార్ సుందర్ సింగ్, సీఐ బి. వెంకటేశ్వరరావు, ఎస్సై చంద్రశేఖర్, డాక్టర్ సుష్మ పాల్గొన్నారు.

వైఎస్సార్ పాలనలో ఏజెన్సీలో విరబూసిన అభివృద్ధి

- పరుగులు పెట్టిన ప్రగతి
- ఎమ్మెల్యే తెల్లం బాలరాజు



వైఎస్ రాజశేఖరరెడ్డికి ఏజెన్సీ సమస్యలు చెబుతున్న ఎమ్మెల్యే బాలరాజు (ఫైల్)

బుట్టాయగూడెం/జంగారెడ్డిగూడెం రూరల్: దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి పాలనా సమయంలో పశ్చిమ ఏజెన్సీ ప్రాంతంలో అభివృద్ధి విరబూసిందని ఎమ్మెల్యే తెల్లం బాలరాజు అన్నారు. శుక్రవారం సాయంత్రం దుద్దుకూరులో ఆయన స్థానిక మాట్లాడుతూ నాటి వైఎస్సార్‌తో ఆయనకున్న అనుబంధం, వైఎస్సార్ చేసిన అభివృద్ధి పనులను వివరించారు. గిరిజన విద్యార్థులు ఉన్నత చదువులకు దూరమైన సమయంలో జూనియర్, డిగ్రీ, ఐటీఐ, పాలిటెక్నిక్ కళాశాలలు ఏర్పాటు చేసి ఉన్నత విద్యల్లో ముందుకు సాగే విధంగా కృషి చేశారన్నారు. నియోజకవర్గ స్థాయిలో 70వేల ఇందిరమ్మ ఇళ్లను నిర్మించిన ఘనత వైఎస్సార్‌దే అన్నారు. 400 కిలోమీటర్ల మేర బీటీ రోడ్ల నిర్మాణానికి కృషి చేసి రహదారుల సమస్య లేకుండా చేశారన్నారు. అటవీ హక్కుల చట్టంలో సుమారు 10 వేల ఎకరాలకు పైగా భూములను పేదలకు వైఎస్సార్ పంపిణీ చేశారని గుర్తుచేశారు. రూ.26 కోట్ల వ్యయంతో గిరిజనుల బీడు భూములకు సాగు నీరు అందించే విధంగా పోగొండ రిజర్వాయర్ నిర్మాణానికి శ్రీకారం చుట్టారన్నారు. ఏటా కొండ కాలువల ప్రవాహానికి అనేక మంది గిరిజనులు మృతి చెందుతుంటే వాటిని నివారించేందుకు రూ. 26 కోట్లతో నాలుగు ప్రదేశాల్లో హైలెవెల్ బ్రిడ్జిల నిర్మాణానికి కృషి చేశారన్నారు. పోలవరం మండలంలో ఏటా గోదావరి వరదనీరు ప్రవాహానికి 50 వేల ఎకరాల పంట భూములు ముంపునకు గురై రైతులు ఇబ్బందులు పడేవారన్నారు. చిరకాల స్వప్నమైన పోలవరం ప్రాజెక్టు నిర్మాణం వైఎస్ చలువతోనే ప్రారంభమైందన్నారు. వైఎస్సార్ సుమారు రూ. 70 కోట్లతో కొవ్వాడ ఔట్‌పాల్స్ క్లూయిస్ పనులకు శ్రీకారం చుట్టారని చెప్పారు. ఏజెన్సీ ప్రాంతంలో గిరిజనులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని 5 ప్రభుత్వ ఆస్పత్రులతో పాటు జంగారెడ్డిగూడెంలో 100 పడకల నిర్మాణానికి కృషి చేశారని తెలిపారు. వైఎస్సార్ పాలనలో సమస్యలపై దరఖాస్తు అందజేసిన వెంటనే నిధులు మంజూరు చేసేవారని చెప్పారు. ఆరోగ్య శ్రీ పథకంలో వేల మంది గిరిజనులు లబ్ధిపొందారని చెప్పారు. నాడు చేసిన అభివృద్ధి కారణంగా వైఎస్సార్‌ను గిరిజనులు దేవుడిగా కొలుచుకుంటున్నారని చెప్పారు. మళ్లీ అదే రీతిలో తండ్రి బాటలో పాలన చేస్తూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గిరిజన ప్రాంత అభివృద్ధికి ఎనలేని కృషి చేస్తున్నారని చెప్పారు.

రాజకీయ పరిజ్ఞానం లేకుండా లోకేశ్ వ్యాఖ్యలు



కొయ్యలగూడెంలో మాట్లాడుతున్న వైసీపీ నాయకులు

కొయ్యలగూడెం: రాజకీయ పరిజ్ఞానం లేకుండా టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ మతిభ్రమించి వ్యాఖ్యలు చేస్తున్నారని వైఎస్సార్ సీపీ ప్రజాప్రతినిధులు, నాయకులు పేర్కొన్నారు. శుక్రవారం కొయ్యలగూడెం సెంటర్లో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ నాలుగు పర్యాయాలు ఎమ్మెల్యేగా గెలిచిన తెల్లం బాలరాజుని విమర్శించే స్థాయి నారా లోకేశ్‌కి లేదన్నారు. గత ప్రభుత్వ పాలనలో ఇసుకను అడ్డగోలు దోపిడీ చేసిన నాటి ఎమ్మెల్యేతో సహా ప్రస్తుత టీడీపీ టికెట్ కోసం పోటీపడుతున్న మరో నేత కలిసి ఇద్దరూ వందల కోట్లు దండుకున్నారన్నారు. పోలవరం ప్రాజెక్టు నిధులను ఏటీఎంగా వాడుకున్నారని, పట్టిసీమ ఎత్తిపోతల పథకంలో రూ.600 కోట్లు స్వాహా చేసిన ఘనత చంద్రబాబు, లోకేష్‌కే చెల్లిందన్నారు. వచ్చే ఎన్నికల అనంతరం టీడీపీ కనుమరుగు కాబోతోందని తెల్లం బాలరాజు ఐదోసారి భారీ మెజార్టీతో గెలవబోతున్నారన్నారని అన్నారు. యువగళం పాదయాత్ర ప్రజాదరణకు నోచుకోలేదని వారన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ గొడ్డటి నాగేశ్వరరావు, ఎంపీపీ గంజిమాల రామారావు, మాజీ ఎంపీపీ మట్టా సత్తిపండు, టౌన్ కన్వీనర్ సంకుకొండ, జిల్లా సోషల్ మీడియా కన్వీనర్ చిక్కాల దుర్గాప్రసాద్, సచివాలయాల మండలం కోఆర్డినేటర్ నూకల రాము, ఎంపీటీసీలు గంట శ్రీను, ఎస్‌కే బాజీ, నాయకులు మారిశెట్టి శ్రీనివాస్, చిన్నం శ్రీను, గంట చిన్న శ్రీను, మడుతూరి శ్రీను పాల్గొన్నారు.

ప్రతి ఇంటికీ పంచాయతీ కుళాయి



పరింపూడిలో వాటర్ ట్యాంక్ నిర్మాణానికి పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

కొయ్యలగూడెం: జల్ జీవన్ మిషన్ పథకం ద్వారా అందరికీ శుద్ధమైన నీరు ప్రతి ఇంటికి అందిస్తున్నట్లు సర్పంచ్ ముప్పిడి విజయకుమారి పేర్కొన్నారు. శుక్రవారం పరింపూడి ఎస్సీ ఏరియాలో నూతనంగా నిర్మించే తాగునీటి వాటర్ ట్యాంక్‌కి ప్రజాప్రతినిధులతో కలిసి ఆమె ప్రారంభోత్సవ పూజలు నిర్వహించారు. 1.20లక్షల లీటర్ల సామర్థ్యం కలిగిన వాటర్ ట్యాంక్ రూ.55 లక్షల రూపాయల వ్యయంతో నిర్మిస్తున్నామన్నారు. పనులు నిర్ణీత వ్యవధిలోగా పూర్తిచేసి ప్రజలకు అందిస్తామన్నారు. జెడ్పీటీసీ గతంలో మంజూరు చేసిన నిధుల ద్వారా నిర్మించిన రెండు తాగునీటి వాటర్ బోర్లను పైపులైను నిర్మించి నూతనంగా నిర్మించే వాటర్ ట్యాంకుకి అనుసంధానం చేస్తామని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ఉదయ్‌కుమార్ తెలిపారు. తిమ్మనకుంటలో 20 వేల లీటర్ల సామర్థ్యం కలిగిన తాగునీటి వాటర్ ట్యాంకును రూ.19 లక్షలతో నిర్మిస్తున్నట్లు పేర్కొన్నారు. ఎంపీపీ గంజిమాల రామారావు, వైస్ ఎంపీపీ మట్టా వనజ, ఉప సర్పంచి సంకు కొండ, స్టేట్ ఫుడ్ కమిషన్ డైరెక్టర్ గంజిమాల దేవి, ఎంపీటీసీ గంటశాల శ్రీనమ్మ, వార్డు సభ్యులు మాడుగుల సువార్త, పూలపల్లి రవి పాల్గొన్నారు.

లబ్ధిదారులకు నూతన పింఛన్ల పంపిణీ



రేచర్ల సచివాలయంలో లబ్ధిదారులకు పింఛన్ అందజేస్తున్న దృశ్యం

చింతలపూడి: పేద, బడుగు, బలహీన వర్గాల నేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని, ఆయన హయాంలో ప్రతి ఒక్కరూ ఎంతో సంతోషంగా జీవిస్తున్నారని ఎంపీపీ డాక్టర్ రాంబాబు నాయక్ అన్నారు. రేచర్ల సచివాలయంలో వైఎస్సార్ పెన్షన్ కానుకలో భాగంగా నూతనంగా మంజూరైన పింఛన్లను లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సచివాలయం పరిధిలో 16మందికి నూతన పింఛన్లు మంజూరయ్యాయన్నారు. పెన్షన్ మంజూరు పట్ల లబ్ధిదారులు సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారన్నారు. సర్పంచ్ శివరామకృష్ణ, వైస్ సర్పంచ్ బాలకృష్ణ, కార్యదర్శి నాగిరెడ్డి, సచివాలయం సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

దరఖాస్తుల పరిశీలన వేగవంతం

కుక్కునూరు: నూతన పింఛన్ల మంజూరుకు సంబంధించి శుక్రవారం వెరిఫికేషన్ ప్రక్రియ ప్రారంభమైంది. పింఛన్ల కోసం ప్రభుత్వానికి దరఖాస్తు చేసుకున్న వారిలో అర్హులను గుర్తించే పనిని ప్రభుత్వం ముగ్గురు అధికారులకు అప్పగించింది. జీలుగుమిల్లి ఎంపీడీఓ కె క్రిష్ణప్రసాద్, కుక్కునూరు ఏంపీడీఓ కార్యాలయ అడ్మినిస్ట్రేటివ్ అధికారి శేషగిరి, ఈఓపీఆర్డీ మోహన్ ఆధ్వర్యంలో వెరిఫికేషన్ ప్రక్రియను చేపట్టారు. శుక్ర, శనివారాల్లో వెరిఫికేషన్ ద్వారా అర్హులను గుర్తించి వారికి ఈ నెల 5న పోలవరం ఎమ్మెల్యే తెల్లం బాలరాజు చేతులమీదుగా పింఛన్ల పంపిణీ ప్రక్రియ చేపట్టనున్నట్టు అధికారులు చెప్పారు.

పుస్తక పఠనంతో మానసిక వికాసం



విద్యార్థులకు పుస్తకాలు అందజేస్తున్న దృశ్యం

కామవరపుకోట: పుస్తక పఠనంతో విద్యార్థులలో మానసిక అభివృద్ధి చెందుతుందని మండల మొదటి విద్యాశాఖ అధికారి డి.సుబ్బారావు, రెండో విద్యాశాఖ అధికారి చిన్నం ప్రశాంత్‌కుమార్ అన్నారు. శుక్రవారం జిల్లా గ్రంథాలయ శాఖ ఆధ్వర్యంలో స్థానిక మండల పరిషత్ ఉన్నత పాఠశాలలో, మంజూరైన పుస్తక పంపిణీ కేంద్రాన్ని వారు ప్రారంభించారు. విద్యార్థులకు పొడుపు కథలు, స్పోకెన్ ఇంగ్లీష్, పిల్లల హాస్య కథలు, జనరల్ నాలెడ్జ్ వంటి పుస్తకాలను విద్యార్థులకు అందజేశారు. కామవరపుకోట సర్పంచ్ కరిపోతు అనూష, ఉప సర్పంచ్ మేడూరు రంగబాబు, ఎంపీటీసీలు బొల్లు వెంకటసత్యనారాయణ, మేడంకి పద్మ, స్థానిక శాఖ గ్రంథాలయ అధికారి భీమరాజు పాల్గొన్నారు.

కుంకుళ్లమ్మకు విశేష పూజలు

ద్వారకాతిరుమల: క్షేత్ర దేవత కుంకుళ్లమ్మవారి ఆలయంలో శ్రావణ శుక్రవారాన్ని పురస్కరించుకుని విశేష పూజలు చేశారు. అమ్మవారికి విశేష పుష్పాలంకరణ చేశారు. యాగశాలలో అర్చకులు, పండితులు వేద మంత్రోచ్ఛరణలతో చండీ హోమాన్ని నిర్వహించారు. భక్తులు అమ్మవారిని దర్శించి పూజలు చేశారు.

పసుపు కొమ్ములతో వాసవి కన్యకాపరమేశ్వరికి అలంకరణ

జంగారెడ్డిగూడెం: జంగారెడ్డిగూడెంలో వాసవీమాత ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు, అన్నప్రసాద వితరణ నిర్వహించారు. లక్ష పసుపు కొమ్ములతో వాసవీమాతను అలంకరించారు. వేలాది మంది భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

ముత్యాలమ్మవారికి వెండి సమర్పించిన దాతలు

జంగారెడ్డిగూడెం: ముత్యాలమ్మ అమ్మవారి ఆలయంలో శ్రావణ శుక్రవారం సందర్భంగా విశేష పూజలు నిర్వహించారు. అమ్మవారి ఆలయంలో ఆలయ నిర్మాణకర్త బవిరిశెట్టి మురళీకృష్ణ, పద్మకుమారి దంపతుల పర్యవేక్షణలో ఆలయ ప్రధానార్చకులు మిత్తిపాటి విశ్వనాథ శ్రీనివాస్ శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. ప్రముఖ వైద్యులు, దివంగత జంగా ప్రసాదరెడ్డి (రెడ్డి డాక్టర్) రెండవ కుమారుడు అమెరికా నివాసి జంగా నారాయణరెడ్డి దంపతులు, వారి కుమార్తె ఇంద్రాణి పాల్గొన్నారు. ఆలయ నిర్మాణకర్త బవిరిశెట్టి మురళీకృష్ణ మాట్లాడుతూ జంగా ప్రసాదరెడ్డి కుమారులు, కుటుంబరెడ్డి భార్య ప్రసన్న, కార్తీక్, నారాయణరెడ్డి, తమ్ముడు శ్రీరామ్, ఇంద్రాణి ముత్యాలమ్మవారికి వెండి కవచం, హస్తాలు, కిరీటం నిమిత్తం మూడు కేజీలు కేజీల వెండిని ఇదివరకే అందజేసారన్నారు. శుక్రవారం ఇంద్రాణి అమ్మవారి వెండి పాదపీఠం కోసం కేజీ వెండి అందజేసారని తెలిపారు. అధ్యాత్మికవేత్త ధనకుమార్, భక్తులు చోడవరపు రంగారావు, జ్యోతి దంపతులు, పసుమర్తి గుప్తారామాదేవి దంపతులు, కంచర్ల రాజా దంపతులు, బొమ్మ పాపారావు దంపతులు పాల్గొన్నారు.

నూకాలమ్మకు గాజులతో అలంకరణ

జంగారెడ్డిగూడెం: నూకాలమ్మవారి ఆలయంలో శ్రావణ శుక్రవారాన్ని పురస్కరించుకుని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారిని లక్ష గాజులతో సుందరంగా అలంకరించారు. భక్తులు భారీ సంఖ్యలో అమ్మవారిని దర్శించుకున్నారు. సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ డాక్టర్ రాజాన సత్యనారాయణ, మున్సిపల్ కమిషనర్ భవానీ ప్రసాద్, పోలుపర్తి రాము, చిట్లూరి సుబ్బారావు, నౌడు నూకరాజు, పట్టణ ప్రముఖులు, మహిళలు పాల్గొన్నారు.

గంగానమ్మకు గాజుల అలంకరణ

జంగారెడ్డిగూడెం: జంగారెడ్డిగూడెంలో గంగానమ్మ అమ్మవారిని శ్రావణమాసం శుక్రవారం సందర్భంగా గాజులతో అలంకరించారు. శ్రావణ శుక్రవార పూజలు ఘనంగా నిర్వహించారు. భక్తులకు బిక్కిన కృష్ణారావు, కాకర్ల కిషోర్ దంపతులు అన్నసమారాధన ఏర్పాటు చేశారు.

కోర్టు ఆదేశాలతో కేసు నమోదు

ద్వారకాతిరుమల: మండలంలోని సత్తెన్నగూడెం పంచాయతీ చెరువులో మట్టి తవ్వకాలు నేపథ్యంలో జరిగిన ఒక వివాదానికి సంబంధించి కోర్టు ఆదేశాలు మేరకు కేసు నమోదు చేస్తామని ద్వారకాతిరుమల ఎస్సై టి.సుధీర్ శుక్రవారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాలు ప్రకారం సత్తెనగూడెం గ్రామం చెరువులో గురువారం రాత్రి జేసీబీ, ట్రాక్టర్ల సహాయంతో మట్టి తవ్వకాలు జరుగుతున్నాయి. ఆ సమయంలో అక్కడకు వచ్చిన కొత్తపల్లి కిషోర్ మట్టి తవ్వకం పనులను తన సెల్‌ఫోన్‌లో ఫోటోలు తీస్తున్నాడు. అదే సమయంలో అక్కడ ఉన్న మానుకొండ సుబ్బారావు, మానుకొండ రాంబాబు, మానుకొండ వేణుగోపాల్, మానుకొండ అజయ్ కలిసి కిషోర్‌పై దాడి చేశారన్నారు. ఈ నేపథలో కిషోర్ ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స నిమిత్తం చేరాడు. దీంతో ఆసుపత్రి నుంచి వచ్చిన సమాచారంపై కేసు నమోదు చేసేందుకు భీమడోలు మేజిస్ట్రేట్‌ను అనుమతి కోరినట్లు ఎస్సై తెలిపారు.

తెలుగు ఉపాధ్యాయుడికి లయన్స్ అవార్డు



మద్దాల పెద్దిరాజు

ద్వారకాతిరుమల: మండలంలోని పంగిడిగూడెం హైస్కూల్లో తెలుగు ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న డాక్టర్ మద్దాల పెద్దిరాజును 2023 విద్యాసంవత్సరానికి లయన్స్ క్లబ్ తరుపున జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపిక చేశారు. సామాజిక, విద్య, సాహితీరంగంలో తాను అందిస్తున్న సేవకు గుర్తింపుగా జిల్లా లయన్స్ సభ్యులు ఈ అవార్డుకు ఎంపిక చేసినట్లు పెద్దిరాజు తెలిపారు. ఆదివారం మధ్యాహ్నం 2 గంటలకు ఏలూరులోని గ్రీన్‌సిటీ సమీపంలోని లయన్స్ భవనలో సత్కార కార్యక్రమం జరుగుతుందని పెద్దిరాజు తెలిపారు.ఈ సందర్భంగా సర్పంచ్ యోహాన్, ఎంఈవో వెంకటరావు, పాఠశాల హెచ్‌ఎం సురేష్ తదితరులు పెద్దిరాజును అభినందించారు.